## క్లుప్తంగా

### ఆండాళ్ అమ్మవారికి తిరునక్షత్ర పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆండాళ్ అమ్మవారు

బోట్‌క్లబ్: ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి


కార్యక్రమంలో పాల్గొన్న బోట్‌క్లబ్ వాకర్స్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ కవిగా పేరొందిన రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి పద్య కావ్యానికి నోబుల్ బహుమతి రావడంతో విశ్వకవిగా ఖ్యాతినొందారని గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటుక్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### క్షమాగుణాన్ని అలవర్చుకోవాలి


సభలో మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త గల్లా సుబ్బారావు

కాకినాడ రూరల్: శాంతియుత జీవనానికి ప్రతి ఒక్కరూ క్షమాగుణాన్ని అలవరుచుకోవాలని ఆధ్యాత్మికవేత్త గల్లా సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటుక్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షమాపణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో కోపతాపాలు సహజమని, ఇవి శృతి మించితే అశాంతితోపాటు అన్ని రోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, శిరీష, ఓం నమశ్శివాయ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయాలకు దాతలు సహకరించాలి


గ్రంథాలయానికి వాటర్‌కూలర్ అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: దాతల సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధి సాధ్యమవుతుందని గాంధీ నగర్ గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాంధీనగర్ శాఖ గ్రంథాలయానికి ఆర్యవైశ్య పూర్వవిద్యార్థుల సంఘం గుడిమెట్ల రామకృష్ణ జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువ గల వాటర్‌కూలర్, డీఎస్సీ, టెట్ పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో కాశీవిశ్వనాథ్, పాఠకులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల కారణంగా కాకినాడ సర్పవరం డీ4 సెక్షన్ పరిధి, శారదాంబ సబ్‌స్టేషన్ 33/11కేవీ ఉప కేంద్రంలో 11కేవీ మధురానగర్ ఫీడర్ పరిధి, గైగోలుపాడు సబ్ స్టేషన్ 33/11కేవీ ఉప కేంద్రం పరిధిలో ఎఫ్‌సీఐ కాలనీ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**డెయిరీ ఫారం పరిధిలో..**

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి రెండు గంటల వరకు డెయిరీఫారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈఎస్ఐ ఆస్పత్రి ఫీడర్‌పై ఉన్న ఈఎస్ఐ క్వార్టర్స్, ఆస్పత్రి ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. గోల్డ్ మార్కెట్ ఫీడర్ పరిధిలో కూడా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అమ్మపాలే అమృతం

- నగరంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- భాగస్వాములైన వివిధ శాఖలు
- విస్తారంగా అవగాహన కార్యక్రమాలు



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మదర్ మిల్క్ బ్యాంక్, వివిధ శాఖల సమన్వయంతో నర్సింగ్ విద్యార్థుల ర్యాలీ

కాకినాడ క్రైం: పాలిచ్చిన తల్లులు పాలించిన దేశం మనది. అటువంటి సమాజంలో బిడ్డకి పాలివ్వడం ఓ భారంగా, బాధ్యతారహితంగా ఉంటున్నారు ఈనాటి తల్లులని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో వెల్లడైన ఓ చేదు నిజం. అటువంటి వారికి అమ్మ పాల కమ్మదనాన్ని తెలియజేసేందుకు ఎంతో ప్రయత్నాలు చేస్తున్నారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరించేందుకు రూపకల్పన చేసిన మహాసంకల్పమే తల్లిపాల వారోత్సవాలు. ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం వారం అంతా నిరాటంకంగా జరిగి బుధవారంతో ముగిసింది. జిల్లా కేంద్రమైన కాకినాడతో పాటు కాకినాడ గ్రామీణం పరిధిలోనూ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి.

తల్లిపాల వారోత్సవాలను వివిధ శాఖ వారు సమన్వయంతో కార్యక్రమాలను పూర్తి చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, సుశేణ హెల్త్ ఫౌండేషన్, కమ్యూనిటీ మెడిసిన్ బృందం తదితర ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీలు, కరపత్రాల పంపకం, నినాదాలు, నాటికలతో యావత్ వారాన్ని ఉత్సవమయం చేశారు.

**సుశేణ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

కాకినాడ జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ నిర్వహిస్తున్న సుశేణ ఫౌండేషన్ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. జీజీహెచ్‌లోని అధికారులు, సిబ్బంది, సుమారు 4 వేల మందితో నర్సింగ్ వైద్య విద్యార్థులతో భారీ ర్యాలీలు నిర్వహించారు. మిల్క్ బ్యాంక్ మేనేజర్ మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ హాజరై ముర్రిపాలు, తల్లిపాల ప్రాధాన్యతపై చర్చించారు. అక్కడకు వచ్చిన తల్లుకు అవగాహన కల్పించారు.

**వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో..**

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్, గ్రామీణాల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న తల్లులు, గర్భిణులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. ఏఎన్‌ఎంలు ఇంటింటా తిరిగి మరీ ముర్రిపాలు బిడ్డకు ఎంత ఆరోగ్యకరమో వివరించారు.

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..**

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పీడీ ప్రవీణ పర్యవేక్షణలో సీడీపీవోలు సూపర్‌వైజర్ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక సదస్సులు నిర్వహించి తల్లిపాలే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తినిస్తుందని తెలియజేశారు. తల్లులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వ్యాయామాల గురించి వివరించారు.


బాలింతకు ముర్రుపాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విద్యార్థులు

**కమ్యూనిటీ మెడిసిన్ బృందం..**

తొలిసారి కాకినాడ రంగరాయ కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ బృందం క్షేత్రస్థాయికి వెళ్లి తల్లులతో మమేకమైంది. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణ వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ దేవీ మాధవి ఆధ్వర్యంలో డాక్టర్ రుక్మిణి ఆమె బృందం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులు ముఖ్యంగా బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను, శిశువుకి లభించే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

### అపోహలొద్దు



పిల్లలకు పాలిస్తే అందం చెడుతుందన్నది అపోహే. అందులో ఎంతమాత్రమూ నిజం లేదు. తల్లులు తగిన వ్యాయామాలు, ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. పైగా బిడ్డకు పాలివ్వడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. పాలివ్వకపోతే ఇన్‌ఫెక్షన్ వచ్చి కొన్ని రకాల క్యాన్సర్లకు దారి తీస్తుంది. కొంత మందిలో పాలు లేని పక్షంలో మదర్ మిల్క్ బ్యాంకులు, ఫార్ములా ఫీడ్‌ను వాడుతున్నారు. ఎంత ఖరీదైన ఫార్ములా ఫీడ్‌లు వాడినా రోగ నిరోధక శక్తిని ఇవ్వడంలో తల్లిపాలను మించి ఏవీ లేవు. పాలు రాకపోతే శాస్త్రీయ విధానాలు అనుసరించాలే తప్ప ఇతర మార్గాలను పాటించకూడదు.

– డాక్టర్ దేవీ మాధవి, హెచ్‌వోడీ, కమ్యూనిటీ మెడిసిన్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ఎంసీ

### ముర్రుపాలు అమృతంతో సమానం



ప్రసవం అయిన 48 గంటల లోపు వచ్చే ముదురు పసుపు రంగులో ఉండే ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. వీటిలో ఆంటీ ఆక్సిడెంట్లు, ఇమ్యునోగ్లోబలిన్స్, యాంటీ ఇన్ఫెక్టివ్, రోగనిరోధక లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పాలలో ప్రొటీన్లు, మినరల్లు, సాల్యుబుల్ ఫ్యాట్, వాటర్ కంటెంట్ కూడా ఉంటాయి. శిశువుకి కనీసం రెండేళ్లు వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలి. ఇలా చేస్తే రోగనిరోధక శక్తి వృద్ధి చెందడంతో పాటు మెదడు కణాలు చురుకుగా ఉంటాయి. శిశువు జన్మించిన తొలి రెండు నెలల్లో ప్రతి రెండు గంటలకు ఒక సారి పాలు పట్టాలి. ఇటువంటి శిశువుల్లో దీర్ఘకాలిక వ్యాధులు రావు. పాలు రాని తల్లులు బ్రెస్ట్ పంప్స్ వాడొచ్చు అలా సేకరించిన పాలను గది ఉష్ణోగ్రతలో ఆరు గంటలు, రిఫ్రిజిరేటర్‌లో 24 గంటలు మించి నిల్వ ఉంచకూడదు. రాత్రి వేళ పాలు పట్టే తల్లుల్లో ప్రొలాక్టిన్ ఉంటుంది. ఇది పాల ఉత్పత్తికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

– డాక్టర్ మాణిక్యాంబ, హెచ్‌వోడీ, పీడియాట్రిక్స్, జీజీహెచ్ కాకినాడ

### బాలింతలు తెలుసుకోవాలి



వంద మంది శిశువుల్లో కేవలం 40 మంది మాత్రమే తొలి ఆరు నెలల్లో తల్లిపాలు తాగుతున్నారు. ఇందుకు తల్లి ఆరోగ్య స్థితే ప్రధాన కారణం. ఈ లోటును భర్తీ చేసేందుకు మదర్ మిల్క్ బ్యాంకులు దోహదపడతాయి. ప్రతి బాలింత తన కన్నబిడ్డ ఆరోగ్యం, భవితను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించాలి. కనీసం 4 లీటర్ల నీరు, అర లీటరు పాలు ప్రతి రోజు తాగాలి. మాంసం, గుడ్డు, నెయ్యి, చేప, పప్పుదినుసులు శుష్టిగా తినాలి. పచ్చి వెల్లుల్లి, మాంసం, బొప్పాయి పండ్లు బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతాయి. తగిన ఆహార నియమాలు పాటించకపోతే కడుపులో మంట, మలబద్ధకం సంభవించి అవి శిశువు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయి. మదర్ మిల్క్ బ్యాంక్ ప్రయోజనాలను పాలు రాని తల్లులు సద్వినియోగం చేసుకోవాలి. అక్కడి బృందాలు తల్లి పాలను సేకరించి పాశ్చురైజేషన్ ద్వారా శుద్ధి చేసి శిశువులకు పడతారు. తమ పాలు మిగిలినా, వృథా అవుతున్నా తల్లులు జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్‌కు అందించవచ్చు.

– డాక్టర్ లావణ్యకుమారి, గైనకాలజిస్టు, సూపరింటెండెంట్, జీజీహెచ్ కాకినాడ

### పరిశుభ్రత అందరి బాధ్యత

కమిషనర్ భావన


సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డును పరిశీలించి సూచనలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: కాకినాడ–సామర్లకోట కెనాల్ రోడ్డును పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత నగర ప్రజలపై ఉందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచే కమిషనర్ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా సామర్లకోట కెనాల్ రోడ్డును కమిషనర్ పరిశీలించారు. కెనాల్ రోడ్డులో చెత్త వేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సీఎస్సార్ నిధుల ద్వారా కాలువ వెంబడి ఏర్పాటు చేయబోయే ఫెన్సింగ్, ప్లాంటేషన్ పనులపై పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనుల తనిఖీల్లో భాగంగా పీఆర్ కళాశాల, డీఎంహెచ్ఓ పరిసర ప్రాంతాల్లో డస్ట్‌బిన్ల నిర్వహణ, చెత్త సేకరణ పనులను పరిశీలించారు. వెహికల్ గార్బేజ్ లిఫ్టింగ్ వివరాలను ఎంహెచ్ఓ పృథ్వీచరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పీడీ జార్జి


జార్జికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ రమేష్, చిత్రంలో సీనియర్ పీడీలు, పీఈటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య (ఎస్‌జీఎఫ్ఐ) కార్యదర్శిగా సీనియర్ పీడీ లంకజార్జి ఎన్నికైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ బుధవారం తెలిపారు. కాకినాడలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు దోహదపడతాయన్నారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శిగా జార్జి రెండేళ్లు కొనసాగుతారన్నారు. అనంతరం జార్జికి డీఈఓ రమేష్ నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పీడీ రవిరాజు, కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా

- కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఇట్ల కిషోర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఇట్ల కిషోర్

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో కిషోర్ వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడ శిశువుపై వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతోపాటు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 111 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, దీనిలో 11 ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెల నుంచి జూలై వరకూ 2 డెకాయి ఆపరేషన్లు నిర్వహించగా 106 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు ఆర్డీవో కిషోర్ తెలిపారు. డీఐవో డాక్టర్ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ఏదైనా స్కానింగ్ సెంటర్లో అవకతకలు గుర్తించిన యెడల టోల్ ఫ్రీ నంబర్ 1800 425 33665కు తెలియజేయాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ న్యూరిష బేగం, కాకినాడ, పెద్దాపురం, తాళ్లరేవు సీడీపీవోలు జి.ఉష, ఎ.జ్యోతి, డి.సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.పద్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్స్ పి.సత్యవతి, మానిటరింగ్ కన్సల్టెంట్ ఎల్.శృతి, ఒ.వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఏ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ షాన్ మోహన్
- స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై సమీక్ష
- పోలీస్ పెరేడ్ మైదానం పరిశీలన



పోలీస్ పెరేడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు

కాకినాడ సిటీ: అధికారులు సమన్వయంతో పని చేసి కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. స్థానిక పెరేడ్ మైదానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ కమిషనర్ భావన, రెవెన్యూ, రోడ్డు భవనాల శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. స్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టమ్, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా సరిచూసుకొని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, రోడ్డు భవనాల ఎస్ఈ జి.కాంతు, జిల్లా పౌరసంబంధాల అధికారి డి.నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాబూరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై సమీక్ష**

స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ షాన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి-శిక్షణ- ఉపాధి కార్యక్రమాలపై విశ్లేషించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శ్రీరమణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను లూటీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

కాకినాడ సిటీ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు అనుగుణంగా పనిచేస్తోందని, నరేంద్రమోదీ ప్రధానిగా కార్పొరేట్‌కు రాయితీలు కల్పిస్తూ లక్షలాది రూపాయాలు రుణాలు మాఫీ చేస్తూ దేశ సంపదను వారికి తాకట్టు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. బుధవారం కాకినాడ అన్నదాన సమాజంలో కాకినాడ జిల్లా జనరల్ బాడీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, దేశంలో రైతాంగం తీవ్రంగా అప్పుల్లో కూరుకుపోయిందని, కేంద్ర ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. ఎన్నడూ లేనంతగా దేశంలో నిరుద్యోగం 43 శాతం పెరిగిందని, కేంద్రంలో నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఉందని గతంలోలాగ బీజేపీ ప్రభుత్వం ఉండుంటే ఈ పాటికి రాజ్యాంగం మౌలిక స్వరూపం మార్చి వేసి మను ధర్మ శాస్త్రాన్ని పెట్టేలా ఆర్ఎస్ఎస్ కుట్ర పన్నిందని ఆయన విమర్శించారు. మోదీ విధానాలను రైతాంగం, కార్మికలోకం తీవ్రంగా వ్యతిరేకించిందని, అందుకే ప్రతిపక్షానికి 240 సీట్లతో లభించాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలతో ధరల భారాన్ని ప్రజలపై రుద్దడానికి సిద్ధమవుతున్నారని, ప్రజల సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులు, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాతూ పార్టీ శత జయంతిని పురస్కరించుకుని పార్టీ శాఖలను నిర్మాణం చేయాలని పార్టీ సభ్యులను రాజకీయంగా రైతాంకంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కిర్ల కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ, మున్సిపల్ కార్మిక నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, కిషోర్, పప్పు ఆదినారాయణ, టి.అన్నవరం, కె.అప్పలరాజు, పీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మధుకర్‌జీ అన్నారు. కాకినాడలోని ఒక హోటల్‌లో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సమావేశం జరిగింది. ప్రతి నెలా ఒకరోజు కాకినాడ జిల్లా ఆఫీసులో నాయకులు, ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుటుంన్నామన్నారు. హర్ గర్ తిరంగ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బూత్ స్థాయిలో నిర్వహించాలని పార్టీ నాయకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హర్ గర్ తిరంగ రాష్ట్ర ఇన్‌చార్జి పి.కాశీ విశ్వనాథరాజు, నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, పెద్దిరెడ్డి రవికిరణ్, సత్యనారాయణ, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

### రత్నగిరీశా సత్యదేవా వచన శతక పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

బాలాజీచెరువు: ప్రముఖ కవి ర్యాలి ప్రసాద్ అన్నవరం సత్యదేవునిపై రచించిన రత్నగిరీశా సత్యదేవా వచనా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి బుధవారం తన కార్యాలయంలో పుస్తకావిష్కరణ అనంతరం మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో అన్నవరం పర్వత శ్రేణుల మీద 130 సంవత్సరాల క్రితం వెలసిన సత్యనారాయణ స్వామి రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఈ ఆలయ ప్రాధాన్యం వివరిస్తూ కవి ర్యాలి ప్రసాద్ రచించడం సంతోషమన్నారు. ర్యాలీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ శతకం సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నల్లమిల్లి శేషారెడ్డి ప్రముఖ ప్రైవేట్ టీవీ చానల్ బిజినెస్ లీడర్–2024 అవార్డు ప్రకటించిన నేపథ్యంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో వడిశెట్టి భాస్కరరెడ్డి, కర్రి వెంకటేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## చేనేతలను ప్రోత్సహించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సంకల్ప సభ్యులు

బోట్‌క్లబ్: భారత దేశ సంస్కృతీ సాంప్రదాయాలలో భాగమైన చేనేత హస్తకళాలలను ప్రోత్సహించాలని కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని పేర్కొన్నారు. స్థానిక వివేకానంద పార్కులో లయన్స్ క్లబ్ సంకల్ప ఆధ్వర్యంలో బుధవారం చేనేతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రామారావుపేట మూడు లైట్ల జంక్షన్ నుంచి లయన్స్ క్లబ్ సంకల్ప ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీని నిర్వహించారు. కార్యక్ర మానికి లయన్స్ క్లబ్ సంకల్ప అధ్యక్షురాలు లావణ్య అధ్యక్షత వహించగా క్లబ్ గవర్నర్ ఇ.వి.వి.ఈశ్వర్ కుమార్ సతీమణి మంగాదేవి ముఖ్యఅతిథ/ గా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మిట్ట రాధా సరస్వతి, రీజనల్ చైర్ పర్సన్ రాజీ , జోన్ చైర్ పర్సన్ సామ రాజేశ్వరి, సంకల్ప్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సువర్చల, ట్రెజరర్ రత్నమాలతి పాల్గొన్నారు.

### మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు

ఐఎఫ్ఎస్ విశ్రాంత అధికారి రామలక్ష్మి


విశ్రాంత డీఎఫ్ఓ రామలక్ష్మిని సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మహిళలు అన్ని రంగాలలో సమాన అవకాశాలు అందిపుచ్చుకుని లక్ష్యం దిశగా పయనించాలని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి పి.రామలక్ష్మి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ×జాతి నిర్మాణంలో మహిళల పాత్రÕ అనే అంశంపై ఇండక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామలక్ష్మి మాట్లాడుతూ భారతీయ ఆర్థిక అభివృద్ధిలో మహిళల ద్వారా అందే జీడీపీ 18 శాతం ఉందని, భారత దేశంలో మహిళ ఇంజినీర్లు 3 శాతం నుంచి 18శాతానికి పెరిగిందన్నారు. మిషెల్ ఉమెన్ ఇండియా డెస్సీ థామస్ సాధించిన సాంకేతిక అభివృద్ధిపై విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రామలక్ష్మిను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ప్రిన్సిపాల్ రామ్మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, పెట్రోలియం హెడ్ కృష్ణభాస్కర్, కెమిస్ట్రీహెడ్ సత్యవేణి పాల్గొన్నారు.